# వ్యవసాయ కార్మికులకు సాగుభూమి, ఇళ్ల స్థలాలు, ఉపాధిహామీ, పక్కా గృహాల కోసం ఆగష్టు 14న ధర్నా

## - సిపియం

**సోదరీ సోదరులారా !**

భూమిలేని ప్రతి కుటుంబానికి భూపంపిణీ చేయాలని, ఇళ్ళు లేనివారందరికీ ఇళ్ళస్థలాలు, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, 200రోజులు ఉపాధిపనులు కల్పించాలని ఆగష్టు14న జరుగు ధర్నాలో వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సిపియం కోరుచున్నది.

**భూమి పెద్దలకేనా? - పేదలకు కాదా?**

పేదల జీవితాల్లో వెలుగు నింపడానికి నా జీవితాన్నే అంకితం చేస్తానని చంద్రబాబు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాడు. కాకులనికొట్టి గద్దలకేసినట్లు తరతరాలుగా దళితులు, ఇతరపేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములు, డి.కె.టి, ఫారెస్టు, పట్టా భూములను గుంజుకొని పెద్దలకు ఇస్తున్నాడు. రాజధాని ప్రాంతంలో వేలాది ఎకరాలు అసైన్డ్ భూములకు నష్టపరిహారం ఇవ్వడంలేదు. ఫారెస్టు భూములు పేదలు సాగు చేసుకుంటే కేసులు పెడుతున్నారు. <u>ఉదా:-</u> మైలవరం ప్రాంతంలో ప్రభుత్వమే లక్షా 60 ఎకరాలు కొల్ల కొట్టాలని చూస్తుంది. దీన్ని ఎవరు శిక్షించాలి? ఇకనుండి పేదలకు భూపంపిణీ చేయం అని తిరుపతి సభలో ప్రకటించాడు. గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగానైనా భూపంపిణీ చేస్తామని చెప్పితే చంద్రబాబునాయుడు రివర్స్‌లో పేదల భూములను పెద్దలకు ఇస్తున్నాడు. రాష్ట్రంలో పేదరికం పెరుగుతుంది. ఎక్కువమంది రెక్కల కష్టంమీద బ్రతుకుతున్నారు. భూమిలేని వారు 73%మంది వున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇక్కడే పేదరికం ఎక్కువ ఉన్నదని 2011సర్వే చెప్పింది. ఈ రాష్ట్రంలో పేదలకు పంచడానికి కావాల్సినంత భూమి ఉందని కోనేరు రంగారావు భూ కమిటీ చెప్పింది. ఆ కమిటి సిఫార్సులను బుట్టదాఖలు చేశారు. ఎక్కడ ప్రభుత్వ భూమి వుంటే అక్కడ రాబందుల్లా అధికార పార్టీ నాయకులు వాలి కబ్జా చేస్తున్నారు. పేదలకు ఇళ్ళస్థలాలు లేక ఒకే ఇంట్లో 3,4కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 6లక్షల మంది పేదలు పక్కా గృహాల బిల్లు రాక మద్యలోనే ఆగిపోయాయి. లక్షా 50వేలతో ఇళ్ళు నిర్మిస్తామని చెప్పి ముఖ్యమంత్రి మాట తప్పాడు. ఒక్కరికి కొత్త ఇళ్లు మంజూరు చేయలేదు.

**ఉపాధికి తూట్లు**

రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొంది కూలీలకు పనులు లేక పెద్దఎత్తున వలసలు పోతున్నారు. బయటకూడా పనులు లేక తిరిగొస్తున్నారు. ఉపాధిహామీ పనుల కోసం అధికారులు చుట్టూ తిరిగినా పనులు ఇవ్వడంలేదు. చేసిన పనికి నెలలతరబడి బకాయిలు చెల్లించడంలేదు. గతంలో 46లక్షల కుటుంబాలకు పని చూపితే ఈ సంవత్సరం కేవలం 21లక్షలకు మాత్రమే పని చూపారు. ఈ చట్టాన్ని ఎత్తివేయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తే త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ దీక్ష చేయడంతోపాటు దేశవ్యాప్తంగా పేదలు ఆందోళనలు చేశారు.

**తెలుగు తమ్ముళ్ళకు నజరానా**

రాష్ట్రంలో నీరు చెట్టు పేరుతో ఉపాధి పనులను యంత్రాలతో చేయించి పేదల పొట్టగొట్టి అధికారపార్టీ నాయకులు పనుల్లోనూ, చెరువుల మట్టి అమ్మకం ద్వారా కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో వేలాది కుటుంబాలకు పనులు లేక పస్తులతో ఉంటున్నారు. సింగపూర్, జపాన్ మీద ఉన్న ప్రేమ బాబుకి పేదలపై లేదు.

**పేదలందరికీ విద్య - వైద్యం**

పేద పిల్లలకు కె.జి నుండి పి.జి దాక ఉచితంగా విద్యనందిస్తామని చెప్పి క్లస్టర్స్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వ స్కూళ్ళను మూసి వేస్తున్నారు. అన్ని రకాల జబ్బులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు లేవు. డాక్టర్లులేరు, తగిన పరికరాలు లేక సరైన వైద్యం అందక అనివార్యంగా పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళి అప్పుల పాలవుతున్నారు. డబ్బులేని పేదలు జబ్బులతో చనిపోతున్నారు. గ్రామాలలో త్రాగటానికి మంచినీళ్ళు లేవు. కానీ ఏ సందులో చూసినా మద్యం ఏరులై పారుతోంది. దీనివల్ల కూలీల బ్రతుకులు నాశనమవుతున్నాయి.

డ్వాక్రా రుణాలు మాఫీ కాక బ్యాంకు అధికారులు పేదలను వేదిస్తున్నారు. రేషన్ షాపుల్లో బియ్యం తప్ప ఏ సరుకులు ఇవ్వడంలేదు. ధరలు మండిపోతున్నాయి. పేదల పరిస్థితి రాష్ట్రంలో ఇంత అధ్వాన్నంగా వుంటే మన ముఖ్యమంత్రి గారు రోజు సింగపూర్, జపాన్‌ల చుట్టూ తిరుగుతూ లక్షలాది ఎకరాల భూమి ఇస్తామని ఎర్రతివాచీలు పరిచి వారికి స్వాగతం పలుకుతున్నాడు. ఎన్నికలలో పేదలకు ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేశాడు.

ఈ నేపథ్యంలో మన సమస్యల పరిష్కారం కోసం పేదలంతా ఏకం కావాలి. ఆగష్టు 14న జరుగు ధర్నాలో వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలు పెద్దఎత్తున పాల్గొనాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విజ్ఞప్తి చేస్తుంది.

**<u>డిమాండ్స్ :</u>**

**(1)** **తక్షణమే భూమి, ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలి. కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలుచేయాలి. భూసేకరణ పేరుతో పేదల అసైన్డ్, డికెటి, ఫారెస్టు భూములను తీసుకోరాదు.**

**(2)** **ప్రతి కుటుంబానికి 200రోజులు ఉపాధి పని రూ.300లు వేతనం ఇవ్వాలి. రాజధాని ప్రాంతంలో 300రోజులు పని ఇవ్వాలి. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి.**

**(3)** **ఇందిరమ్మ ఇళ్ళ పాతబకాయిలు విడుదల చేయాలి. నిర్మాణ వ్యయం రూ.2.50లక్షలకు పెంచి కొత్త ఇళ్ళు మంజూరు చేయాలి.**

**(4)** **ప్రభుత్వ ఆసుపత్రులకు నిధుల కేటాయించాలి. సిబ్బంధిని నియమించాలి. అన్ని రకాల మందులు, పరికరాలు అందించాలి.**

**(5)** **కెజి నుండి పిజి దాక పేదలకు ఉచిత విద్యను అమలుచేయాలి.**

**(6)** **ప్రతి కుటుంబానికి 30కేజిల బియ్యంతోపాటు అన్ని రకాల నిత్యావసరాలు ఇవ్వాలి.**

**(7)** **మంచినీటి సమస్యను పరిష్కరించాలి. విచ్చలవిడి మద్యం అమ్మకాలను రద్దు చేయాలి.**

**అభివందనములతో..**

**తేది : 22.07.2015**

## భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు)

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**